క్లుప్తంగా

అభాగ్యులకు ఆహారం, రగ్గుల పంపిణీ



అభాగ్యులకు భోజనం ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న జాకబ్ సువర్ణరాజ్

డాబాగార్డెన్స్: రెఫ్యూజ్ మినిస్ట్రీస్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలువురు అభాగ్యులకు శుక్రవారం మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు అందజేశారు. చలికాలం దృష్ట్యా రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకుడు జాకబ్ సువర్ణరాజ్ మాట్లాడుతూ సంస్థ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో అభాగ్యుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్, సంగం శరత్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో గల నిరాశ్రయులకు దుప్పట్లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి స్నేహప్రియ, ప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



తులసీరావు (ఫైల్)

అల్లిపురం: ఆటో డ్రైవర్ అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. నేరెళ్లకోనేరు ప్రాంతానికి చెందిన ఎల్లా తులసీరావు (46) ఈ నెల 2వ తేదీ రాత్రి ఆటో వేసేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. 3వ తేదీ ఉదయం 10 గంటలు అవుతున్నా అతను ఇంటికి చేరుకోలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతను ఆటోతో సహా కనిపించడం లేదని అతని భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపారు. తులసీరావు ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9059322992 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

వార్డ్ బాయ్‌లు, ఆయాల ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న వార్డుబాయ్‌లు, ఆయాలు

మహారాణిపేట: ఉద్యోగాల నుంచి తొలగించిన పలువురు కార్మికులు, సిబ్బంది సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. ఎలాంటి నోటీసులు లేకుండా 40 మంది సిబ్బందిని తొలగించారని వార్డ్ బాయ్‌లు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆస్పత్రి యాజమాన్యం హీనంగా చూస్తుందని, గత 15 సంవత్సరాల నుంచి ఉద్యోగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని అన్నారు. తమపై కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, ఇప్పుడు అర్ధంతంగా తొలగించడం వల్ల తాము రోడ్డున పడ్డామని అన్నారు. ఇన్నేళ్లుగా ఉద్యోగం చేస్తున్న తమను కాదని, కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని తీసుకుంటున్నారని తెలిపారు. తక్షణమే తమను విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే ఆత్మహత్యలే శరణ్యం అని తొలగించిన వార్డ్ బాయ్‌లు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు.

రేసపువానిపాలెంలో అన్నదానం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతి స్వరూపిణి దుర్గా అమ్మవారి ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి వారం అన్నదానం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. అన్ని దానాల్లోనూ అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ ప్రతి శుక్రవారం 108 మందికి అన్నదానం చేయడం సంతోషకరమన్నారు.

ఆక్షన్.. నో యాక్షన్





రెండేళ్లుగా వేలం పాట జరగని రెల్లివీధి చేపల మార్కెట్

- రెండేళ్లుగా నిలిచిపోయిన రెల్లివీధి చేపల మార్కెట్ వేలం
- భారీగా నష్టపోతున్న జీవీఎంసీ

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నెలవారీ జీవీఎంసీకి చెల్లించిన నగదు వివరాలు	
ఏప్రిల్	: రూ. 8,910
మే	: రూ. 8,410
జూన్	: రూ. 13,390
జూలై	: రూ. 19,160
ఆగస్టు	: రూ. 18,240
సెప్టెంబర్	: రూ. 11,960
అక్టోబర్	: రూ. 14,440

జగదాంబ: రెండు సంవత్సరాలుగా రెల్లివీధి చేపల మార్కెట్‌కు వేలం పాట నిర్వహించక పోవడంతో జీవీఎంసీకి నష్టం వాటిల్లుతోంది. 38వ వార్డులో ఉన్న రెల్లివీధి చేపల మార్కెట్‌కు జీవీఎంసీ రెవెన్యూ అధికారులు ప్రతి సంవత్సరం మార్చిలో వేలం పాట నిర్వహించేవారు. అయితే ఈ ఏడాది ఆ సమయంలో ఎన్నికల కోలాహలం, కోడ్ అమల్లో ఉన్న కారణంగా వేలం వాయిదా చేశారు. అలాగే గత ఏడాది కూడా మార్కెట్‌కు పాట నిర్వహించలేదు. ఇలా రెండు సంవత్సరాలు వేలం నిర్వహించకుండా కేవలం డిపార్ట్‌మెంట్ కలెక్షన్ పేరుతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. డిపార్టుమెంట్ కలెక్షన్లు అయినా పూర్తిగా చెల్లిస్తున్నారా అంటే అదీ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా జీవీఎంసీ వేలం పాట నిర్వహిస్తే రెల్లివీధి చేపల మార్కెట్ నుంచి ఏడాదికి రూ. 3 నుంచి రూ. 5 లక్షల వరకు ఆదాయం వచ్చేదని చెబుతున్నారు. కానీ డిపార్ట్‌మెంట్ కలెక్షన్ల పేరుతో రోజుకు రూ. 200 నుంచి రూ.300, రూ. 400 వరకు ఇలా నెలకు పది నుంచి పదకొండు వేలు మాత్రమే జీవీఎంసీకి చెల్లిస్తున్నారని తెలిసింది. దీని వల్ల జీవీఎంసీకి లక్షల్లో నష్టం వాటిల్లుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

అతనే కీలకం..

వాస్తవంగా ప్రతి ఏడాది జోన్ పరిధిలో వేలం పాట నిర్వహణ బాధ్యత గుమస్తాదే. అన్ని మార్కెట్లు, దుకాణ సముదాయాలు, వాటి రెన్యువల్స్ వంటి వ్యవహారాలు గుమస్తా చూడాల్సి ఉంటుంది. కానీ రెండు సంవత్సరాలుగా రెల్లివీధి చేపల బజార్ వేలం పాటకు కనీసం ప్రకటనలు కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. వేలం పాట కోసం వచ్చే కాంట్రాక్టర్ల చేత ఎల్ఐసీ పాలసీలు కట్టిస్తూ వారికి అనుకూలంగా గమస్తా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా రెండు సంవత్సరాలుగా రెల్లివీధి మార్కెట్‌కు వేలం పాట నిర్వహించకపోవడంపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మార్కెట్‌కు వేలం పాట నిర్వహించని అంశాన్ని పరిశీలిస్తాం. అలాగే కార్యాలయంలో సిబ్బంది సొంత పనుల కోసం ప్రభుత్వ సమయాన్ని దుర్వినియోగం చేస్తున్న విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– ఎం.మల్లయ్యనాయుడు, జోన్–4 జోనల్ కమిషనర్, సూర్యాబాగ్.

పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతో అభివృద్ధి చేయాలి

జగదాంబ: పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేట్‌కు ఇవ్వాలనే టెండర్లు రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు జగన్ మాట్లాడుతూ ఈ విషయంపై ఇప్పటికి 39 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. పోర్టు యాజమాన్యం ఇప్పటికైనా సొంత నిధులతో ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పోర్టు, డాక్‌యార్డు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబాలు, పెన్షనర్లు, పూల్ కళాసీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికుల వంటి 40 వేల మందికి పైగా ఆస్పత్రి సేవలు పొందుతున్నారని అన్నారు. అటువంటి ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడాన్ని కార్మికులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. గతంలో కూడా పోర్టు కార్మిక సంక్షేమం కోసం నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, కళావాణీ ఆడిటోరియం ప్రైవేటు పరం చేయడంతో కార్మికులకు దూరమయ్యాయని అన్నారు. ఈ ఆస్పత్రి విషయమై హైకోర్టు కూడా కార్మిక సంఘాల అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పిందన్నారు. కానీ పోర్టు యాజమాన్యం కోర్టు ఆదేశాల బేఖాతరు చేస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేను, హెచ్ఎంఎస్ సీనియర్ నాయకుడు డి.కె.శర్మ, ఎస్.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో వార్షిక తనిఖీలు



డాగ్ స్క్వాడ్ పనితీరును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి శుక్రవారం నగర ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఏఆర్ మైదానంలో సిబ్బంది పరేడ్‌ను, టర్న్ ఔట్‌లతో పాటు డాగ్ స్క్వాడ్ పనితీరు, సిబ్బంది లాఠీ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, పీఈటీ బ్యాండ్, వెపన్ స్కిప్పింగ్ అండ్ అసెంబ్లింగ్‌ను పరిశీలించారు. అత్యవసర సమయాల్లో గుంపులను చెదరగొట్టేందుకు వినియోగించే మల్టీ షెల్ లాంచర్, వజ్రా వాహనం ద్వారా వాడే మల్టీ బ్యారెల్ లాంచర్ ప్రయోగించే తీరును పర్యవేక్షించారు. ఏఆర్‌లో వినియోగిస్తున్న క్వార్టర్ మాస్టర్ సామగ్రిని పరిశీలించిన అనంతరం సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 తర్వాత నగర ఏఆర్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించడం లేదన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఏ సమస్య వచ్చినా 79950 95799కు సంప్రదించాలని సూచించారు. ఎటువంటి సలహాలు ఉన్నా తెలియజేయాలన్నారు.

క్యాన్సర్ నివారణ దిశగా అవగాహన పెంపొందించాలి



క్యాన్సర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ శివానంద్, డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

మహారాణిపేట: క్యాన్సర్ వ్యాధి నివారణ దిశగా ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేజీహెచ్‌లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. ర్యాలీ కేజీహెచ్ నుంచి మెడికల్ కాలేజీ మీదుగా సాగి మళ్లీ కేజీహెచ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు కోసం ఆరు బ్యాచ్‌ల్లో ఫీల్డ్ స్టాఫ్‌కు శిక్షణ ఇప్పించామన్నారు. వీరు క్యాన్సర్ లక్షణాలు గల రోగులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మాట్లాడుతూ ప్రివెంటివ్ అంకాలజీ ఓపీ విభాగాన్ని కేజీహెచ్ సీఎస్ఆర్ బ్లాకులో ఓపీ నంబరు 40లో ప్రతి మంగళవారం, గురువారం నిర్వహిస్తామని, ఈ నెల 12 నుంచి ఈ విభాగం అమలులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, అంకాలజీ నోడల్ అధికారి డాక్టర్ కె.సాయి సుష్మ, రేడియేషన్ అంకాలజీ విభాగాధి పతి డాక్టర్ పాండురంగ కుమారి, సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ గురురాఘవేంద్ర నాయక్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాలిపేటలో కార్డన్ సెర్చ్

ప్రతి ఇల్లు తనిఖీ చేసిన పోలీసులు



అనుమానితులను ప్రశ్నిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి తదితరులు

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం కార్డన్ సెర్చ్ చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి, టూటౌన్ సీఐ బి.తిరుమలరావు, మహారాణిపేట ఎస్ఐ అప్పలనాయుడు సిబ్బందితో కలిసి సాలిపేటలో ప్రతి ఇంటిని సోదా చేశారు. వాహనాలు తనిఖీ చేసి అనుమానితుల నుంచి వివరణ తెలుసుకున్నారు. వీధుల్లో అనుమానితులను ప్రశ్నించారు. మహిళలతో మాట్లాడి స్థానికంగా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణలో ప్రజల పాత్రపై వారికి వివరించి, పోలీసులకు సహకరించాలని కోరారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు.

ఏఐ టెక్నాలజీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఈవో ఇంతియాజ్

సీతమ్మధార: ప్రస్తుత డిజిటల్ పోటీ ప్రపంచంలో ఏఐ టెక్నాలజీపై అందరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్ఆర్ మేనేజర్ కమాండర్ అర్జున్ రాధాకృష్ణ సూచించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఆర్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ సీఈవో ఇంతియాజ్ అర్షద్ మాట్లాడుతూ హెచ్ఆర్ మేనేజర్లు తమకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే రాణించగలరన్నారు. ఎల్వీజీ దక్షిణాసియా మాజీ సీఎఫ్‌వో గిరిధరన్‌మాట్లాడుతూ మానవ వనరులు అభివృద్ధిలో మేనేజర్లు కీలక పాత్ర వహిస్తారన్నారు. బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధిలో ఎనిమిదేళ్లుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల నైపుణ్య శిక్షణలు అందించి.. వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. అనంతరం నాగేశ్వరరావును సీఈవో ఇంతియాజ్ అర్షద్ ఘనంగా సత్కరించారు. వివిధ కంపెనీలు, హోటళ్లు, ఆస్పత్రుల హెచ్ఆర్ మేనేజర్లు, ఎస్‌డీఐ, బొల్లినేని సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో వైద్య శిబిరం



చికిత్స పొందిన వారిని పరామర్శిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్. చిత్రంలో డీఆర్‌వో భవానీశంకర్

మహారాణిపేట: కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇండస్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ప్రారంభించారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు భాగస్వామ్యమయ్యారు. శిబిరం ప్రారంభంలో భాగంగా అక్కడ అందించే వైద్య సేవల గురించి కలెక్టర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు, మందుల పంపిణీ ఇతర ప్రక్రియలను పరిశీలించిన ఆయన వైద్య శిబిరం ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను అభినందించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన శిబిరంలో ఇండస్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, కింది స్థాయి సిబ్బందికి వివిధ రకాల వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సుమారు 100 మందికి పైగా వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎ. త్రినాథ్, కార్యదర్శి సీహెచ్‌వీ రమేశ్, ఉపాధ్యక్షుడు డి. రాజేంద్ర వర్మ, యూనియన్ నగర అధ్యక్షుడు యోగి, రవిశంకర్, శ్యాంప్రసాద్, ఇండస్ ఆస్పత్రి డీజీఎం లక్ష్మణ్, సీఈవో చంద్రమౌళి, న్యూరోఫిజీషియన్ డాక్టర్ లలిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కుటుంబం చెంతకు వ్యక్తి



ఆకాశ్ పన్నాను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: పశ్చిమ బెంగాల్ నుంచి విశాఖ విచ్చేసిన యువకుడిని ఎట్టకేలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏయూటీడీ సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆకాష్ పన్నా (33) విశాఖ వచ్చి రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా ఏయూటీడీ సిబ్బంది గుర్తించి ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం షెల్టర్లో ఆశ్రయం కల్పించారు. రెండు రోజుల తర్వాత ఆకాశ్ పన్న దగ్గర కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ తీసుకొని అన్నయ్య బికాష్ పన్నాకు ఫోన్ చెయ్యడంతో వైజాగ్ వచ్చారు. ఆకాశ్ పన్నా మానసిక స్థితి బాగులేక ఇల్లు వదిలి వచ్చేశాడని, అతనికి భార్య, ఒక కుమార్తె ఉన్నారని తెలిపారు. అతని కోసం వెతుకుతున్నామని, ఏయూటీడీ సంస్థ సమాచారం ఇవ్వడంతో చాలా ఆనందపడినట్లు తెలిపారు. తమ్ముడికి ఆశ్రయం కల్పించి ఆదుకున్నందుకు ఏయూటీడీ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆకాశ్ పన్నాను షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి సమక్షంలో అన్నయ్య బికాశ్ పన్నాకు అప్పగించారు.

నూతన విద్యార్థులకు స్వాగతం



స్వాగత కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ నూతన విద్యార్థుల రాకతో కళాశాల కుటుంబం మరింత శక్తివంతం అవుతుందని, కళాశాలలో ఉన్న అవకాశాలు, సౌకర్యాలు విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకుని లక్ష్యాలు సాధించి కళాశాల కీర్తిని మరింత ఇనుమడింపజేయాలన్నారు. అనంతరం స్టూడెంట్ కౌన్సిల్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి మాట్లాడుతూ స్వాగత కార్యక్రమం ద్వారా సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు కళాశాల సాంప్రదాయాలను పరిచయం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు.. పాటలు.. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ పీఎల్ శరణ్య ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సభ్యుల మృతికి నివాళి

డాబాగార్డెన్స్: పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థ సభ్యులు పీఎం సత్యనారాయణ, పాలకొండ లక్ష్మమ్మ, రుక్మిణి ఆండాల్ ఇటీవల మరణించడంతో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ద్రోణంరాజు శ్రీవత్సవ్ మరణించిన సంస్థ సభ్యులకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వివేకానంద సంస్థలో సంస్థ సభ్యులు ఎవరు మృతి చెందినా వారి పేరిట సంతాప సభ నిర్వహిస్తూ, అన్నదాన కార్యక్రమాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అంతే కాక కాశీ పుణ్యక్షేత్రంలో వారి పేరిట పిండ శాంతి పూజలు చేసి వారి ఆత్మకు శాంతి చేకూరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, జి. రాము, పీఎం సతీష్, వివేకానంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన



నేరెళ్లకోనేరు జంక్షన్‌లో యూజీడీ పనులను ప్రారంభిస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం: జీవీఎంసీ 32వ వార్డు పరిధి నేరెళ్లకోనేరు జంక్షన్ నుంచి చావులమదుం జంక్షన్ వరకు భూగర్భ మురుగునీటి పారుదల పైప్ లైన్‌ను శుక్రవారం వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20 లక్షలతో వార్డులో యూజీడీ పనులు చేపడుతున్నామన్నారు. వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. వార్డును అభివృద్ధి చేయడానికి తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో నారా నాగేశ్వరరావు, మంత్రి శాలివాహన, కొట్యాల రమేష్, నీలబాబు, సీపీఐ బుజ్జి, కందుల రాజశేఖర్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, నాగేంద్ర, సూరి, ప్రసాద్, జానకి, శ్రీదేవి, కందుల బద్రీనాథ్, కందుల కేదార్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార : రామాటాకీస్ ప్రాంతంలో గంజాయితో తిరుగుతున్న ఓ వ్యక్తిని ద్వారకా జోన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కి చెందిన రణబీర్‌యాదవ్ (27) శుక్రవారం రామాటాకీస్ ప్రాంతంలో నాలుగు కిలోల గంజాయితో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని సమాచారంతో ద్వారకా పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఒడిశా నుంచి తీసుకొచ్చిన గంజాయిని గోవాకి తరలించే క్రమంలో అరెస్ట్ చేశారు. ఈ కేసుని ద్వారకా సీఐ బీవీ రమణ పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.